క్లుప్తంగా

పంచాయతీ వేలంపాట వాయిదా

ముద్దనూరు : స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ 2023–24 ఆర్థిక సంవత్సరానికి శుక్రవారం నిర్వహించిన వేలంపాట వాయిదాపడింది. వేలంపాటలో బస్టాండు, జంతువధశాల, సులభ్‌కాంప్లెక్స్ నిర్వహణలకు వేలంపాట నిర్వహించాల్సివుంది. అయితే రూ.1లక్షా 60వేల ధరతో జంతువధశాలకు వేలంపాట పూర్తైందని, బస్టాండు, సులభ్‌కాంప్లెక్స్ నిర్వహణకు వేలంపాట దారులు ఒక్కరే వుండటంతో ఈ రెండింటిని వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి నరసింహులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం బస్టాండు, సులభ్‌కాంప్లెక్స్‌లకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

క్రమశిక్షణ కలిగి ఉండాలి

ఎర్రగుంట్ల : ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రమశిక్షణ కలిగిఉండాలని అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పట్టణ సీఐ మంజునాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం చిలంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, అట్టలను గ్రామీణ వికాస సేవా సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, హౌసింగ్ శాఖ డైరెక్టర్ వై.వి. డేవిడ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

పెండ్లిమర్రి : సబ్ జూనియర్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పెండ్లిమర్రి మండలం నందిమండలం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన బి.సాయికిరణ్, సి.ఆదిశేషారెడ్డిలు ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్‌ఎం కళావతి, పీడీ రాజశేఖర్‌లు శుక్రవారం తెలిపారు. ఈపోటీలు ఈనెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జరుగుతాయన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, పీడీలు జ్ఞాపికలు అందించి సత్కరించారు. అలాగే స్కూల్ కమిటీ చైర్మన్ శివశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

బాల్య వివాహాలు అరికట్టే బాధ్యత ప్రతి ఒక్కరిది

సింహాద్రిపురం : సమాజంలో బాల్య వివాహాలు అరికట్టే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సమగ్ర శిక్ష సెక్టారల్ అధికారులు ఎంఐఎస్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ లక్ష్మీనరసింహరాజు, సమ్మిళిత కో ఆర్డినేటర్ కేశవరెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కోవరంగుంటపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలిక విద్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కనీస వయస్సు దాటేంతవరకు బాలికలకు పెళ్లి చేయకూడదన్నారు. బాలికలు చదువుకుని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం పరిశీలకులు సత్యనాగరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

పులివెందుల రూరల్ : పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో ఉన్న విద్యాధరి పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం మాదక ద్రవ్యాలపై ఎస్ఈబీ సీఐ రామాంజనేయరెడ్డి అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. డ్రగ్స్ వాడకంవల్ల కంటి సమస్యలు, ఆకలి లేకపోవడం, అధిక రక్తపోటు లాంటివి వచ్చే అవకాశం ఉందన్నారు. యువత మేలుకొని భవితకు పునాదులు వేసుకోవాలన్నారు.

ఆర్టీపీపీ సీఈకి వినతి


ఆర్టీపీపీ సీఈకి వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

ఎర్రగుంట్ల : ఏపీ జెన్‌కో యజమాన్యం ఉద్యోగులందరికీ నూతన బయోమెట్రిక్ అమలు చేయాలని ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేసి పాత విధానంను కొనసాగించాలని కోరుతూ శుక్రవారం యూనియన్ నాయకులు ఆర్టీపీపీ సీఈ మురళీక్రిష్ణకు వినతి అందించారు.

శిశు, బాలిక సంరక్షణ బాధ్యత తీసుకోవాలి

ఎర్రగుంట్ల : సమాజంలో బాలిక శిశు సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సమగ్రశిక్ష ప్లానింగ్ కో–ఆర్డినేటర్ పి లక్ష్మీనరసింహరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సమ్మిళిత విద్యా కో–ఆర్డినేటర్ ఎం.కేశవరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవుని ఆరోగ్య సంజీవని
చిరు ధాన్యాలే

- చిరు ధాన్యాలను వదిలితే జబ్బులను కొని తెచ్చుకున్నట్లే
- సంపూర్ణ ఆరోగ్యం కోసం చిరు ధాన్యాలవైపు పరుగులు


కొర్రలు (ఇన్‌సెట్) జొన్నలు

సింహాద్రిపురం : పూర్వం మానవునికి ఆరోగ్య సంజీవని చిరు ధాన్యాలే.. కాల క్రమేనా చిరు దాన్యాలను వదిలి జబ్బులు కొని తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం సంపూర్ణ ఆరోగ్యం కావాలంటే మళ్లీ చిరుధాన్యాలవైపు ప్రజలు పరుగులు తీస్తున్నారు. చిరు ధాన్యాలంటే జనానికి చులకన. చిరు ధాన్యాల వాడకం అంటే బద్దకం. చిరు దాన్యాలు ఒకప్పుడు దేశంలోని అధిక శాతం మందికి ప్రధాన ఆహారవనరు. కాలక్రమేనా ప్రజలు చిరు ధాన్యాలను తినడం మాని బియ్యం, గోధుమలవైపు పరుగులు తీశారు. ఫలితంగా లెక్కలేనన్ని జబ్బులను తెచ్చి పెట్టుకున్నారు.

ఓసారి చిరుధాన్యాల పూర్వపరాలను పరిశీలిద్దాం..

చిరుధాన్యాలంటే కొర్రలు, జొన్నలు, రాగులు, సజ్జలు, ఊదలు మొదలైనవి. వీటిని తృణ ధాన్యాలు అని కూడా అంటారు. ఎప్పుడో బ్రిటీష్ వారు తాము తింటున్న బియ్యం, గొదుమలు మాత్రే గొప్పవని, మిగిలినవి తక్కువ రకానికి చెందినవని భావించారు. పైగా ఎక్కువ మంది భారతీయులు తింటున్న ఈ రెండవ రకానికి తృణ(తక్కువ) ధాన్యాలు అని పేరు పెట్టారు. 1990కి ముందు మన దేశంలో ప్రజలు అధిక శాతం మంది ఈ చిరు ధాన్యాలను తినేవారు. 1980కి ముందైతే కొన్ని కుటుంబాలు ఏపండుగో.. పబ్బమో.. పెళ్లి లేదా కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగలేకపోయినప్పుడే చిరు ధాన్యాలను కాదని ఆ బువ్వ (బియ్యం అన్నం) తినే యోగం కలిగేది. చిరు ధాన్యాలు ప్రధానంగా వర్షాధారపు పంటలు, తక్కువ వర్షం పడినా ఇవి పండుతాయి. అందుకే ప్రత్యేకించి రాయలసీమ ప్రాంతంలో చిరుధాన్యాలు ఒకప్పుడు ఎక్కువగా పండించేవారు. కాలక్రమంలో వ్యవసాయం తగ్గిపోవడంతోపాటు చిరు ధాన్యాలను పండించడం కూడా బాగా తగ్గిపోయింది. ఇదే క్రమంలో పట్టణాలు, పల్లెల్లో కూడా కష్టం చేసేవారం తగ్గిపోయి మధుమేహంతోపాటు ఇతర జబ్బులను కొని తెచ్చుకుంటున్నారు. ఫలితంగా బియ్యానికి బదులుగా చిరు ధాన్యాల వాడకం ఇటీవల మళ్లీ పెరిగింది. చిరు ధాన్యాలను తింటే మధుమేహం, అధిక బరువు, ఇతర జబ్బులు అదుపులో ఉంటాయని వైద్యులు, ఇతర పోషకాహార నిపుణులు స్పష్టం చేస్తుండటంతో జనం మళ్లీ చిరు ధాన్యాలవైపు మళ్లుతున్నారు. బియ్యం అన్నానికి బదులు రాగి సంగటి, కొర్ర అన్నం, రొట్టెలు, రాగి గంజి లాంటివి ఆహార పదార్థాల వాడకం పెరగడం గమనిస్తున్నాం. ఒకప్పుడు ధనవంతులు తినే ఆహారంగా గొప్పగా భావించిన బియ్యం అన్నాన్ని వదిలి జనం చిరుధాన్యాలవైపు చూస్తున్నారు. బియ్యంలో లేని అనేక పోషకాలు చిరు ధాన్యాలలో ఉండటం విశేషం. చిరు ధాన్యాలు అని తేలికగా తీసివేయకుండా వీటిని ఒక్కసారి పరిశీలిస్తే చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేయడమే కాకుండా ఎన్నో రకాల పోషక పదార్థాలన్ని చిరుధాన్యాలలో ఉండటం గమనార్హం.

ఒకవిధంగా చెప్పాలంటే చిరుధాన్యాలు ఆరోగ్య ప్రదాయిని అని చెప్పక తప్పదు. పంట కాలంలో తక్కువ నీటిని తీసుకుంటాయి. తక్కువ కాలంలో దిగుబడి వస్తుంది. వీటికి ధర కూడా బాగా ఉంది. కొర్రల్లో ఒక రకమైన అండుకొర్రలు అయితే ఏకంగా కేజీ రూ.150ల నుంచి రూ.200లు ధర పలుకుతున్నాయి. ఇప్పటికే చాలామంది చిరు ధాన్యాల వాడకాన్ని పెంచారు. ఈ సంఖ్య పట్టణాల్లో ఎక్కువగా ఉంది. కానీ గ్రామాల్లో తక్కువే అని చెప్పాలి. చిరు ధాన్యాల వాడకంవలన ఆరోగ్యానికి రక్షగా ఉంటుందన్నది మాత్రం వాస్తవం.

ఆరోగ్యానికి చిరుధాన్యాలు ఎంతో మేలు



నావయస్సు 80 సంవత్సరాలు నేను మొదట్లో చిరుధాన్యాలు వాడేవారం ఆరోగ్యంగా ఉండేవాడిని. అయితే కొన్ని సంవత్సరాలు తరువాత బియ్యం వాడకం మొదలు పెట్టాం. అప్పటినుంచి ఆరోగ్యసమస్యలు మొదలయ్యాయి. మళ్లీ చిరుధాన్యాలు తీసుకోవడంవల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటున్నాను. ప్రస్తుతం చిరుధాన్యాలు వాడకపోవడంవల్ల అనారోగ్య పాలవుతున్నారు. ప్రస్తుతం సమాజంలో రైతులు కూడా చిరుధాన్యాలవైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో రైతులకు మంచి ఆదాయం ఉంటోంది.

– కృపాకర్‌రెడ్డి(స్థానికుడు), బి.చెర్లోపల్లె

చిరుధాన్యాలవైపు మొగ్గు చూపండి..



ప్రస్తుత సమాజంలో చిరుధాన్యాల ఉపయోగం ఎక్కువ కావడంతో నేను రెండు ఎకరాలలో వాటినే పండిస్తున్నాను. ఒకవైపు వైద్యులు చిరుధాన్యాలు మానవుని మనుగడకు ఎంతో దోహదపడతాయంటున్నారు.

– సులోచన(స్థానికురాలు), తుమ్మలపల్లె

జూదరుల అరెస్టు

ముద్దనూరు : మండలంలోని చిన్నదుద్యాల గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 6 మంది జూదరులను పోలీసులు శుక్రవారం అరెస్టుచేశారు. వీరి వద్ద నుంచి రూ.19,200ల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఈబీ సీఐ చెన్నారెడ్డి తెలిపారు.

రేషన్ పంపిణీ సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : పులివెందుల పరిధిలోని రేషన్ పంపిణీ సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఎండీయూ ఆపరేటర్లను హెచ్చరించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి అధ్యక్షతన ఎండీయూ ఆపరేటర్లకు, రేషన్ డీలర్లకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. బియ్యం పంపిణీలో అవకతవకలు జరిగితే ఉపేక్షించేదిలేదన్నారు. తూకాలు కూడా సక్రమంగా ఇవ్వాలని ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు. ఎవరైనా రేషన్ ఇవ్వలేదని ఫిర్యాదు చేస్తే వారిని తొలగించడం జరుగుతుందన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. ఆపరేటర్లకు కేటాయించిన వీధులలో ప్రతి ఒక్కరికి రేషన్ సరుకులు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గోవింద్ మోరే, ఆర్ఐ సుజిత్, డీలర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ పార్టీ నాయకులు, తదితరులు

చక్రాయపేట : అభివృద్ధి సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. చక్రాయపేటలో మండల తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయ నూతన భవన నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ. 4 కోట్ల నిధులు మంజూరు చేసింది. శుక్రవారం వీటికి భూమి పూజ కార్యక్రమాన్ని ఏపీ టూరిజం డైరెక్టర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, తహసీల్దార్ రాజసింహ నరేంద్రతో కలిసి నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు చక్రాయపేట మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించారన్నారు. నేడు మండల తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం నూతన భవన నిర్మాణాలు రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా చక్రాయపేటలో నాలుగు కోట్ల రూపాయలతో నిర్మించడం జరుగుతుందన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించేలా చూడాలని కాంట్రాక్టర్ హేమసుందర్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో స్థల దాతలు మునిరత్నంరెడ్డి, రామమోహన్‌రెడ్డి, మధుసుదన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ హర్షద్, ఎంపీటీసీ లీలావతి, మండల సమన్వయకర్త ఓబుల్‌రెడ్డి, మండల యూత్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ అధ్యక్షుడు ప్రసాద్‌రావు, సచివాలయ కన్వీనర్ రామాంజులరెడ్డి, పులివెందుల నియోజకవర్గ సర్పంచుల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, పీఆర్‌డీఈ రవిచంద్రారెడ్డి, ఈఓపీఆర్‌డీ గంగులయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీబీ ప్రాణాంతక జబ్బు కాదు

జమ్మలమడుగు : టీబీ వ్యాధి ప్రాణాంతక జబ్బు కాదని వ్యాధిని గుర్తించిన వెంటనే డాక్టర్ల సూచనల మేరకు మందులు వాడితే జబ్బు దూరం అవుతుందని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫీక్ పాషా తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆసుపత్రి నుంచి పాతబస్టాండ్ వరకు డాక్టర్లు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు సుజాత, సూర్యనారాయణరెడ్డి, చంద్రకళ, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రతాప్‌కుమార్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

తొండూరు : క్షయ వ్యాధి నిర్మూలనకు పాటుపడదామని హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మల్లేల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ డాక్టర్ అరిఫ్ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. అనంతరం వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర కమ్యూనిటీ అధికారిణి సోమేశ్వరి, ఆరోగ్య కార్యకర్త వరలక్ష్మి, వీరాంజనేయులు, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జెఎన్‌టీయూ విద్యార్థుల ప్రతిభ


క్రీడా పోటీలలో ప్రతిభ చూపిన జెఎన్‌టీయూ విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో శుక్రవారం వార్షిక అథ్లెటిక్స్ మీట్ నిర్వహించారు. ఈ మీట్‌ను ప్రిన్సిపాల్ వసుంధర, వైస్ ప్రిన్సిపాల్ రమణారెడ్డి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి డాక్టర్ ఎ.దామోదరరెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీ జోజిరెడ్డిలు ప్రారంభించారు. ఈ పోటీలలో 100, 200, 400 మీటర్ల పరుగు పందెం పోటీలు, షాట్‌పుట్, త్రోబాల్ తదితర పోటీలలో జెఎన్‌టీయూ విద్యార్థులు ప్రతిభ చూపారు. విజేతలైన విద్యార్థులను ప్రిన్సిపాల్ మెడల్స్ వేసి సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘననివాళి



సింహాద్రిపురం : ఏపీ ప్రెస్ అకాడమి మాజీ చైర్మన్, సీనియర్ పాత్రికేయుడు శ్రీనాథరెడ్డి భౌతికకాయం వద్ద శుక్రవారం పలువురు ఘనంగా నివాళులర్పించారు. కోవరంగుంటపల్లె గ్రామంలోని ఆయన స్వ గృహంలో దేవిరెడ్డి శ్రీనాథరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, కడప నగర మేయర్ సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారపురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ కృష్ణారావు, పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు, పులివెందుల డీ ఎస్పీ శ్రీనివాసులు, సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, డీటీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

నీటి వనరులను పరిరక్షించుకుందాం

చింతకొమ్మదిన్నె : నీటి వనురులను పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత తెలిపారు. శుక్రవారం మండలంలోని మద్దిమడుగు గ్రామంలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఆమె నీటి ప్రాముఖ్యతను గురించి వివరించారు. ప్యానల్ న్యాయవాది, చంద్రకాంతమ్మ, టెలి లా న్యాయవాది అరుణకుమారి, ప్రజలు పాల్గొన్నారు.

పలు చోట్ల చలివేంద్రాలు ప్రారంభం

వేముల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి ప్రారంభించారు.

పెండ్లిమర్రి : స్థానిక బస్టాండ్ సమీపంలో శుక్రవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్‌లు ప్రారంభించారు. వెలుగు ఏపీఎం వెంకటేశ్వరరావు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద శుక్రవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఏపీఎం మంజునాథ ప్రారంభించి మాట్లాడారు.

తొండూరు : తొండూరులో శుక్రవారం ఏపీఎం వెంకటనారాయణ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీసీలు, గ్రామ అధ్యక్షులు, ఆనిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె : మండల సమాఖ్య ఆధ్వర్యంలో పాత వెలుగు కార్యాలయంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి చేతులమీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఏపీఎం బాలస్వామి సీసీ వీరాంజనేయులు, జాబ్ కో ఆర్డినేటర్ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్వీసింగ్ సెంటర్ ప్రారంభం

పులివెందుల రూరల్ : పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెగా టూవీలర్ స్పేర్ పార్ట్స్ అండ్ సర్వీస్ సెంటర్‌ను శుక్రవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేళ్ల సాంబశివారెడ్డి, రసూల్, శివశంకర్‌రెడ్డి, చంద్రమౌళి, వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో మంచి పోషకాలు

వీరపునాయునిపల్లె : చిరుధాన్యాల్లో మంచి పోషకాలు ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి అన్నారు. శుక్రవారం వీరపునాయునిపల్లె సెక్టారు పరిధిలో తంగెడుపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషన్ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో దొరికే చిరుధాన్యాలలో ఎక్కువ శాతం పోషకాలు ఉంటాయని కావున ప్రతి ఒక్కరూ తప్పకుండా తినాలని తెలిపారు. చిరుధాన్యాలు తినడం వలన గర్భిణులు, చిన్నారులు, కిషోరి బాలికలు తినడంవలన ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. చిరుధాన్యాలైన అలసందలు, పెసలు, రాగులు మొదలైనవన్ని తినేలా పిల్లలకు అలవాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సంధ్య, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు


గాయపడ్డ వ్యక్తి

సింహాద్రిపురం : మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో శుక్రవారం ద్విచక్రవాహనంపై వెళుతుండగా గేదేలు అడ్డురావడంతో కిందపడి గుర్తుతెలియని వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతున్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

సీఎంకు కృతజ్ఞతలు

పులివెందుల టౌన్ : బోయ, వాల్మీకులను ఎస్టీలలో చేరుస్తూ ఏపీ అసెంబ్లీలో తీర్మాణం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వాల్మీకి సంఘ రాష్ట్ర డైరెక్టర్ అంబకపల్లె నారాయణస్వామి, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళిలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం పులివెందులలో వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఆర్థికంగా వెనుకబడి, ఒకే రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతంలో ఎస్టీలుగా, మైదాన ప్రాంతంలో బీసీలుగా పరిగణించబడుతూ వెనుకబడిన బోయ, వాల్మీకులను ఎస్టీలుగా చేరుస్తూ అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపడం హర్షించదగ్గ విషయమన్నారు.

భూ యజమానులు సహకరించాలి


వైఎస్ భాస్కర్‌రెడ్డితో మాట్లాడుతూ భూ యజమానులు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో రింగ్ రోడ్డు చుట్టూ భూములు కోల్పోతున్న యజమానులకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందిస్తోందని సహకరించాలని వైఎస్సార్‌సీపీ నియోజవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఆర్డీఓ వెంకటేశులు అధ్యక్షతన భూ యజమానులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైఎస్ భాస్కర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామన్నారు. సహకరించి ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సిరిమాను ఉత్సవం


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలంలోని వద్దిరాల గ్రామంలో సుంకులమ్మతల్లి తిరునాల సందర్భంగా శుక్రవారం సిరిమాను ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన బండలాగుడు పోటీలను ప్రారంభించారు. కర్నూల్, అనంతపురం గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఎటువంటి గొడవలు జరుగకుండా డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో సిఐ టీ.వి.కొండారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పోలీస్ బందోబస్త్ నిర్వహించారు. పెద్దకోట్లాలకు చెందిన ఎద్దు మొదటి బహుమతి రూ. 80 వేలు, రెండవ బహుమతి రవీంద్రారెడ్డికి చెందిన ఎద్దకు రూ.70 వేలు, 3వ బహుమతి పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎద్దకు రూ.60 వేలు లభించింది. అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్‌పర్సన్ వెంపలాకు లీలావతి, ఎంపీపీ చేరెడ్డి సావిత్రి, జడ్పీటీసీ మహాలక్ష్మి, సర్పంచ్ జయశ్రీ, మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాపాల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి


పరిశ్రమ యజమనులతో మాట్లాడుతున్న కమిషనర్ పి.జగన్నాథ్

ఎర్రగుంట్ల : మున్సిపాలిటీ పరిధిలో పన్నులు వసూళ్ల మాత్రం చేస్తున్నారు మరీ మాకు కల్పించాల్సిన మౌలిక సదుపాయలు పట్టించుకోండని నాపరాయి పరిశ్రమ యజమానులు కోరుతున్నారు. పట్టణంలోని హనుమనుగుత్తి రస్తాలో ఉన్న నాపరాయి పరిశ్రమ యజమానులు శుక్రవారం కమిషనర్‌ను కలసి విన్నవించారు. పాలిష్‌మిషన్‌ల నుంచి ఆస్తి పన్నులు ప్రతి ఏడాది వసూళ్లు చేస్తున్నారన్నా రు. కానీ మాకు కల్పించాల్సిన రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సదుయపాలు కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతే పన్నులు అడగాలన్నారు. ఈ విషయంపై కమిషనర్ పి.జగన్నాథ్ మట్లాడుతూ గతంలోనే అక్కడ మౌలిక సదుపాయలు కోసం టెండర్లు పిలిచామన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ గంగిరెడ్డి, ఏఈ సందీప్, నాపరాయి పరిశ్రమ యజమానులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు : సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో అమ్మవారిశాల వీధికి చెందిన ఆదిలక్ష్మమ్మకు సీఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.4.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. వచ్చిన డబ్బులను వృథా చేసుకోకుండా వాడుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పొరెడ్డి మహేశ్వరరెడ్డి, కౌన్సిలర్ గౌరీనాథ్‌రావు, కో ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభి వృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ ఆసరా

- నియోజకవర్గ వ్యాప్తంగా 3642 సంఘాలకు లబ్ధి
- మహిళల ఖాతాల్లోకి రూ.32.39కోట్ల మేర జమ
- ఈనెల 25న ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్


సమావేశమైన డ్వాక్రా సంఘాల మహిళలు

వేముల : రాష్ట్రంలోని మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని అమలు పరుస్తున్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామి మేరకు డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని అందిస్తున్నారు. ఈనెల 25న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వైఎస్సార్ ఆసరా నిధులను నేరుగా మహిళల ఖాతాల్లోకి జమ చేయనున్నారు. ఇప్పటికే రెండు విడతలుగా వైఎస్సార్ ఆసరా నిధులను సీఎం వైఎస్ జగన్ మహిళల ఖాతాల్లోకి జమ చేశారు. మహిళల సాధికారతే ధ్యేయంగా ఈ పథకాన్ని అమలు చేసి డ్వాక్రా మహిళలకు సీఎం వైఎస్ జగన్ అండగా నిలుస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలోని 3642 డ్వాక్రా సంఘాలకు రూ.32.39కోట్ల మేర డ్వాక్రా మహిళలకు అందించనున్నారు. వైఎస్సార్ ఆసరాతో మహిళా సంఘాలను బలోపేతం చేయడంతోపాటు మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా నిలదొక్కుకునేలా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం డ్వాక్రా మహిళలకు వరమని చెప్పవచ్చు. రుణాలు తీసుకున్న సంఘాల మహిళలు సకాలంలో రుణాలను చెల్లిస్తున్నారు. అంతేకాక వైఎస్సార్ ఆసరాతోపాటు డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేసి మహిళల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్ వెలుగులు నింపుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయాలకు లబ్ధిదారుల జాబితా చేరింది. ఆయా మండలాల్లోని సచివాలయాలలో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శనకు ఉంచారు. ఈ జాబితాలో ఏ సంఘానికి ఎంత మొత్తం వస్తుందో తెలియజేసే వివరాలు ఉన్నాయి. ఈ పథకం ద్వారా వచ్చే సొమ్ముతో మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం చెందుతున్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 3642 సంఘాల మహిళలు వైఎస్సార్ ఆసరా పథకంతో లబ్ధి పొందుతున్నారు.

వైఎస్సార్ ఆసరా పథక వివరాలు

మండలం	సంఘాల సంఖ్య	మొత్తం (రూపాయలలో)
పులివెందుల	230	రూ.1.97కోట్లు
వేముల	498	రూ.4.10కోట్లు
వేంపల్లె	987	రూ.10.06కోట్లు
లింగాల	528	రూ.4.38కోట్లు
తొండూరు	403	రూ.3.52కోట్లు
చక్రాయపేట	473	రూ.3.09కోట్లు
సింహాద్రిపురం	523	రూ.5.24కోట్లు